

కథా కౌముది

యే దేశ్‌హై వీర జవానోం కీ! మూలా కుమార్

సికింద్రాబాద్ డిఫెన్స్ క్లబ్ లోని, రిసెప్షన్ ఏరియా అంతా చాలా కోలాహలంగా ఉంది. అక్కడక్కడ చెట్లకు, స్టేజ్ మీద పూల తోరణాలమీద అలంకరించిన సన్నని, చిన్నచిన్న రంగురంగుల లైట్ల తోరణాల నుంచి వెలుగులు చిందుతున్నాయి. ఒక పక్కగా చిన్న స్టేజ్ మీద బ్యాండ్ వాళ్ళు మంద్ర స్వరంలో పాటలు వినిపిస్తున్నారు. గేట్ దగ్గర పూలతో ఆర్చ్ లాగా అలంకరించారు. దానికి ఒక పక్కగా "భారతి వెడ్స్ భగత్" అని అందంగా వ్రాసిన బోర్డ్, నిలువెత్తు వధూవరుల ఫొటోతో అతిథులకు ఆహ్వానం పలుకుతోంది. ఆవరణ అంతా పిల్లల కోలాహలం, పెద్దల కబుర్లు, పూల,అత్తరు పరిమళాలతో ఆహ్లాదంగా ఉంది. అందంగా అలంకరించిన వివాహవేదిక మీద, కెప్టెన్.భగత్, భారతి చిరునవ్వులు చిందిస్తూ ఉన్నారు. భగత్ తమ్ముడు రాజ్ హడావిడిగా తిరుగుతున్నాడు. భగత్ పక్కన, భగత్ తల్లితండ్రులు కల్నల్ వీర్ సింగ్, రాంప్యారీ, భారతి పక్కన భారతి తల్లితండ్రులు కల్నల్ పాణి, విమలలు నిలబడి ఉన్నారు.

ఆహుతులు జంటలుగా వచ్చి వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించి, కల్నల్ వీర్ సింగ్, రాంప్యారి, కల్నల్ పాణి, విమలలను విష్ చేసి ఫొటో తీసుకొని వెళుతున్నారు. లాన్‌లో అక్కడక్కడా గుండ్రటి బల్లలు, వాటి చుట్టూ నాలుగేసి కుర్చీలు వేసి ఉన్నాయి. బల్లల మీద తెల్లని టేబుల్ క్లాత్స్ వేసారు. మధ్యలో చిన్న ఫ్లవర్ వాజ్‌లో గులాబీలు అమర్చారు. అక్కడ కూర్చున్నవారికి, లాన్‌లో అక్కడక్కడా నిలబడి కబుర్లు చెప్పుకుంటున్నవారికి యూనీఫాంలో ఉన్న వెయిటర్‌లు స్నాక్స్, డ్రింక్స్ అందిస్తున్నారు.

అమ్మ ఎవరితోనో మాట్లాడుతుంటే, రాజ్ చిన్నగా వదినగారి పక్కన చేరి, "నీకు ఇంత కన్నా మంచి గాగ్రా లేదా?" అన్నాడు.

"ఏమయింది నా గాగ్రాకు? భగత్ నే ఈ గాగ్రాను సెలెక్ట్ చేసాడు తెలుసా?" అంది భారతి.

"వాడి మొహం వాడికి సెలెక్షన్ ఏమి తెలుసు? తెలుస్తే నిన్ను సెలెక్ట్ చేసుకునేవాడా?" ఏడిపిస్తున్నట్లుగా అన్నాడు.

"ఏయ్ నిన్నూ..." రాజ్ ను కొట్టటానికి చేయి ఎత్తింది.

"ఏమిటీ ఇక్కడా పోట్లాడుకుంటున్నారా?" మందలింపుగా అంది రాంప్యారి.

"చూడండి ఆంటీ! నా గాగ్రా, నేనూ బాగాలేమట. వెక్కిరిస్తున్నాడు" మొహమంతా గులాబీ రంగులోకి తిరిగి కళ్ళల్లో చిన్నగా ఊరుతున్న నీళ్ళతో అంది.

"నీకేం తల్లీ, బంగారు రంగు గాగ్రాలో బంగారు బొమ్మలా మెరిసిపోతున్నావు" అంటూ కోడలిని దగ్గరగా తీసుకొని, "రాజ్ ఊరుకో" అంటూ చిన్నకొడుకును మందలించింది.

"వెవ్వెవ్వే" అని భారతిని వెక్కిరించాడు రాజ్!

"నువ్వే వెవ్వెవ్వే" తిరిగి వెక్కిరించింది భారతి.

"అబ్బా... వీళ్ళిద్దరితో ఎట్లా వేగుతానో!" తల పట్టుకున్నాడు భగత్.

కల్నల్ వీర్ సింగ్,కల్నల్ పాణి ఇద్దరూ సేం కోర్స్ మేట్స్. వాళ్ళ కోర్స్ మొదలైనప్పుడే, పెళ్ళిళ్ళు కూడా ఒకేసారి అయ్యాయి. వీర్ కు ఇద్దరు కొడుకులు భగత్, రాజ్ గురు. పాణికి ఒక్కతే కూతురు భారతి. పాత పేరని ఎందరు వెక్కిరించినా భరతమాత మీద ఉన్న గౌరవం, అభిమానంతో కూతురికి 'భారతి ' అని పేరు పెట్టుకున్నాడు పాణి. చాలా వరకూ ఇద్దరికి ఒకటే స్టేషన్ కు ఒకేసారి పోస్టింగ్స్ వస్తుండటముతో ఇద్దరి మధ్యా స్నేహం కుదిరింది. పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. పెద్ద క్లాస్ లకు వస్తున్నారని, సికింద్రాబాద్ వాతావరణం బాగుంటుంది. మంచి స్కూల్స్, కాలేజెస్ ఉన్నాయని సైనిక్ పురిలో పక్కపక్కనే ఇళ్ళు కట్టుకొని కుటుంబాలను ఉంచి, వాళ్ళు మటుకు సెలవుల్లో వస్తూ పోతున్నారు. దానితో కుటుంబాల మధ్య కూడా సానిహిత్యం పెరిగింది. భారతి లేత పసిమి రంగులో, సుకుమారంగా ఉంటుంది. దానికి తగ్గట్టు శారీరకంగా, మానసికంగా సున్నితం. ఎటువంటి భావోద్వేగాలను తట్టుకోలేదు. భగత్, రాజ్ ఇద్దరూ దృఢంగా ఉంటారు. భగత్ కు భారతి అంటే చాలా ఇష్టం. స్కూల్ లో, బయట భారతికి ఒక రక్షణగా ఉంటాడు. పెరుగుతున్న కొద్దీ ఇద్దరి మధ్యా స్నేహం, అభిమానం

ప్రేమగా మారింది. ఇక రాజ్ కాస్త దుందుడుకు పిల్లవాడు. భారతిని ఎప్పుడూ ఏడిపిస్తూ ఉంటాడు. ఇద్దరికీ ఒక్క క్షణం కూడా పడదు. ఇద్దరి గొడవలు తీర్చలేక భగత్ సతమతం అవుతుంటాడు. భగత్, భారతిల మధ్య స్నేహం, ప్రేమ, రాజ్, భారతిల మధ్య చిలిపి కయ్యాలతో పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. భగత్, రాజ్ ఇద్దరూ NDA లో చేరి ఆర్మీ ఆఫీసర్స్ అయ్యారు. భారతి ఇంజనీరింగ్ చేసి, హైటెక్ సిటీలోని ఒక కంపెనీలో కాంపస్ సెలక్షన్స్ లో సెలెక్ట్ అయ్యి ఉద్యోగంలో చేరింది. భగత్, భారతిల మధ్య చిగురించిన ప్రేమను అంగీకరించటానికి పెద్దలకు వారి కులగోత్రాలు అడ్డం రాలేదు. వారి వివాహం ఉత్తర–దక్షిణ భారతదేశంల మధ్య వారధిలా రంగరంగ వైభోగంగా జరిపిస్తున్నారు.

చిరు చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఆకాశంలో చందమామతో పోటీపడి నక్షత్రాలు మెరుస్తున్నాయి. లాన్ లో బార్డర్ గా వేసిన మల్లె మొక్కలకు పూసిన మొగ్గలు విచ్చుకుంటూ సువాసనలు వెదజల్లుతున్నాయి. సన్నటి గాలులు వీస్తూ వాతావరణం ఆహ్లాదంగా ఉంది. రిసెప్షన్ కు వచ్చిన ఆహుతులందరూ వెళ్ళారు. వధూవరులు, వారి తల్లి తండ్రులు కూడా అక్కడ అన్నీ సర్దమని పనివాళ్ళకు చెప్పి, ఇంటికి చేరారు.

★★★

తలుపులు మూసి, తిరిగి చూసాడు భగత్. తెల్లని సాటిన్ చీరలో, తలలో మల్లెపూవుల సువాసనలతో, పొందికగా మంచం మీద ముడుచుకొని కూర్చొని ముద్దుగా కనిపించింది భారతి. బాల్య స్నేహితురాలు, ప్రేయసి, ప్రియసతి, భారతిని మురిపింగా చూసి, భారతి దగ్గరగా వచ్చాడు.

"రతీ..." మృదువుగా పిలుస్తూ భారతి చుబుకం సున్నితంగా ఎత్తి ఏదో చెప్పబోయాడు.

"అన్నయ్యా... అన్నయ్యా..." బయట నుంచి తలుపు కొడుతూ రాజ్ పిలిచాడు.

"వెధవా... ఇప్పుడూ అల్లరేనా" విసుక్కున్నాడు భగత్.

"భగత్" తండ్రి పిలుపు కూడా వినిపించి, తలుపు తీసి బయటకు వచ్చాడు భగత్.

"సారీ" అంటూ చేతిలోని స్మార్ట్‌ఫోన్ అందిచ్చాడు రాజ్!

వెంటనే డ్యూటీకి రిపోర్ట్ చేయమని లీవ్ సాంక్షనింగ్ అథారిటీ నుండి ఆదేశం!

మామగారి మాట వినిపించి భగత్ తో పాటు బయటకు వచ్చిన భారతి నిశ్చేష్టగా నిలబడిపోయింది. పెళ్ళి సందడితో కళకళలాడుతున్న ఇల్లు ఒక్కసారిగా మూగబోయింది. గదిలోకి వచ్చి, భారతితో ఏమి మాట్లాడాలో తెలియలేదు భగత్ కు. ఒక్క నిమిషం తదేకంగా భారతిని చూసి, దగ్గరకు తీసుకొని హృదయానికి హత్తుకున్నాడు. చిన్నగా విడదీస్తూ " తొందరగానే వచ్చేస్తాను" అన్నాడు. మనసులో మన త్రివర్ణ పతాకం కప్పుకొని కానీ, ఎగరవేస్తూ కానీ తప్పకుండా వచ్చేస్తాను అనుకున్నాడు!

★★★★

ఇంట్లో ఒకరితో ఒకరు మాట్లాడుకోవటము లేదు. అందరూ టీ.వీ న్యూస్ ముందు కూర్చుంటున్నారు. పాణి, వీర్ ల సెలవు ఇంకా ఉండటంతో ఇంట్లోనే ఉన్నారు. పాణి, విమల భారతిని ఇంటికి రమ్మని పిలిచారు. కానీ భారతి రానని తిరస్కరించింది. దానితో అందరూ వీర్ ఇంట్లోనే భారమయిన హృదయాలతో ఉన్నారు. అప్పటికి భగత్ వెళ్ళి వారం అయ్యింది.

ఆ రోజు పొద్దున్నే ఇద్దరు సీనియర్ ఆఫీసర్ లు వచ్చారు. వారిని చూడగానే వీర్ కు విషయం అర్థం అయింది. గుండె చిక్క బట్టుకొని వారిని లోపలికి ఆహ్వానించాడు. ఒక్క క్షణం నిశ్శబ్దం తాండవించింది. వాళ్ళిద్దరూ వీర్ కు సెల్యూట్ చేసి, "మీ కుమారుడు దేశం కోసం పోరాడుతూ శత్రువు చేతిలో వీరమరణం పొందాడు, Killed in Action అని గుర్తించబడ్డాడు" అని చెప్పారు.

వీర్,రాజ్ లు చేష్టలుడిగి ఉండిపోయారు! వచ్చిన ఆఫీసర్స్ కోసం మంచినీళ్ళు తెస్తున్న రాంప్యారి, చేతిలోని ట్రే అప్రయత్నంగా క్రింద పడింది. రాంప్యారి మొహం రెండు చేతులతో కప్పుకొని సోఫాలో కూర్చుండిపోయింది. వాళ్ళ మాటలు వినిపించి లోపలి నుంచి వచ్చిన భారతి, గుమ్మం పట్టుకొని కిందికి జారిపోయింది. వెనుకే వచ్చిన విమల కూతురుని దగ్గరగా పొదువుకుంది. లోపలికి వస్తున్న పాణి అలాగే నిలబడిపోయాడు.

వచ్చిన ఇద్దరు ఆఫీసర్ లూ అలాగే నిశ్శబ్దంగా కొద్దిసేపు ఉండిపోయారు. ఆ తరువాత, వీర్ చేతిని మృదువుగా పట్టుకుని, వారి కళ్ళల్లో, స్వరంలో, గౌరవం ఉట్టిపడుతుండగా, భారంగా,"సర్, మీ కుమారుడు మా అభిమాన ఆఫీసర్, దేశం కోసం హిమాలయాల్లో టెర్రరిస్టులతో పోరాడుతూ తన ప్రాణాలు ఇచ్చిన వీరుడు. మేము అతని వీరత్వాన్ని, త్యాగాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటాము. ఈ విషయం మీకు చెప్పేందుకు మాకూ చాలా బాధ కలుగుతోంది. మీ బాధను మేము అర్థం చేసుకోగలము. మీకు అవసరమైన ప్రతి సహాయం, పెన్షన్, మెడికల్, కౌన్సెలింగ్ మా బాధ్యత. మీకు మా మద్దతు ఎప్పుడూ ఉంటుంది." అని చెప్పి వెళ్ళిపోయారు.

ఈ వార్త తెలియగానే సైనిక్ పురిలోని వారే కాక, చుట్టుపక్కల వారంతా కూడా తండోపతండాలుగా వచ్చారు. అందరి కనులూ నీళ్ళతో నిండిపోయాయి. కాళ్ళ పారాణి ఆరని కొత్తపెళ్ళికూతురిని చూసి కంట తడి పెట్టని వారు లేరు. వీర్, పాణి కుటుంబం వారంతా స్తబ్ధుగా కూర్చుండిపోయారు.

మరునాడు, ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ లో, ట్రైకలర్‌తో కప్పిన మెటల్ కాఫిన్ లో ఉంచిన భగత్ డెడ్ బాడీని, సీనియర్ ఆఫీసర్, ట్రూప్ లైన్ లో నిలబడి గన్ సల్యూట్ చేస్తూ వీర్ కు హాండోవర్ చేసారు.

భగత్ శవయాత్ర లో ఊరు ఊరంతా పాల్గొన్నారు. "జై భగత్! భగత్ అమర్ రహే!"

అని నినాదాలు చేస్తూ, పూలు చల్లుతూ దారంతా నినాదాలు చేసారు. కన్నీటి నివాళులు అర్పించారు. సైనిక వందనంతో గౌరవంగా భగత్ ను సాగనంపారు.

★★★

"ఆంటీ, ఇట్లా కూర్చున్నారేమిటి?" భగత్ ఫొటో ముందు, ఒడిలో భగత్ చిన్నప్పటి నుంచీ ఉన్న ఫొటో ఆల్బంలను పెట్టుకొని, కన్నీళ్ళతో, సోఫాకు ఆనుకొని కూర్చున్న రాంప్యారిని అడిగింది భారతి.

"అంకుల్ మీరు కూడా ఏమిటీ ఇట్లా కూర్చున్నారు? రాజ్ ఏమిటీ గడ్డం చేసుకోకుండా దేవదాసులా కూర్చున్నావు? ఎవరైనా అమ్మాయిని ప్రేమించావా ఏమిటి?" కిలకిలా నవ్వుతూ, ట్రే లో కాఫీ కప్స్ ఉన్న ట్రేను పట్టుకొని నిలబడి ఉన్న భారతిని ముగ్గురూ ఆశ్చర్యంగా చూసారు. లోపలికి వస్తున్న పాణి, విమలలకు అర్థం కాక అలాగే నిలబడిపోయారు.

వాళ్ళను చూస్తూ "పొద్దున్నే నా చేతి కాఫీ తాగాలని వచ్చారా? రండి రండి" అని ఆహ్వానించింది.

కాఫీ కప్ ను రాంప్యారీకి ఇస్తూ దండ వేసి, దీపం, అగరువత్తి వెలిగించి ఉన్న భగత్ ఫొటోను చూసి, ఏదో జ్ఞాపకం వచ్చినట్లుగా నో... అని అరుస్తూ, చేతిలోని ట్రే ను క్రింద పడేసి, భగత్ ఫొటో ముందు కూలబడింది.

"నో... నో... ఇది నిజం కాదు. నా భగత్ ఎక్కడికీ పోలేదు. తొందరగా వస్తాను అని చెప్పి వెళ్ళాడు. భగత్ మాట తప్పడు. నాకోసం వస్తాడు" అంటూ, గట్టిగా ఏడుస్తూ భగత్ ఫొటో మీది దండను తీసి, విసిరి పడేసింది. భగత్ ఫొటోను తీసుకొని గుండెకు హత్తుకొని, గట్టిగా ఏడవసాగింది.

అకస్మాత్తుగా జరిగిన ఈ సంఘటనకు ముందు బిత్తరపోయినా...

"అమ్మలూ..." అంటూ విమల, పాణీ,

"బేటీ..." అంటూ వీర్, రాంప్యారి భారతి దగ్గరగా వచ్చారు.

"వద్దు... మీరెవరూ నా దగ్గరకు రావద్దు" అరుస్తూ భగత్ ఫొటోతో బయటకు పరిగెత్తింది. వెనుకనే రాజ్ వడివడిగా వెళ్ళి, భారతిని పట్టుకొని బలవంతంగా లోపలికి తీసుకొచ్చాడు.

★★★

ఆ రోజు ఆగస్ట్ పదిహేను. దేశమంతా స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటోంది. దేశభక్తి గేయాలు అంతటా మారుమోగుతున్నాయి. కల్నల్ రాజ్ గురు, కల్నల్ అశోక్ హాస్పిటల్ లోకి వచ్చారు. హాస్పిటల్ ఆవరణంతా పెద్ద పెద్ద చెట్లతో, విశాలంగా, శుభ్రంగా ఊడ్చి, ముగ్గులు వేసి ఉంది. అక్కడక్కడా చెట్ల కింద, ఆవరణలోనూ రోగులు, వారితో వారి అటెండర్స్ ఉన్నారు. వారందరినీ చూస్తూ, లోపలికి వచ్చేటప్పుడు బోర్డ్ మీద చూసిన "మానసిక చికిత్సాలయం" అన్నది గుర్తు వచ్చి "వదినను చూపిస్తానని ఇక్కడి కి తీసుకొచ్చావేమిటి?" రాజ్ ను ఆశ్చర్యంగా అడిగాడు అశోక్.

చిన్నగా నిట్టూర్చి,అక్కడి నర్స్ కు ఏదో చెప్పి, అశోక్ తో "ఇక్కడ కూర్చుందాము రా" అని ఒక చెట్టు కింది బెంచ్ మీద కూర్చుంటూ అన్నాడు రాజ్.

"అన్నయ్య మరణించింది భారతి నమ్మలేకపోయింది. మొదట్లో కొన్నిసార్లు మనలోకంలోకి వచ్చి ఏడుస్తూ ఉండేది. భగత్ కాఫిన్ మీది జెండా తన దగ్గరే పెట్టుకుంది. భగత్ చనిపోయాడని తలపుకు వచ్చినప్పుడు ఆ జెండాను గుండెలకు హత్తుకుని హృదయ విదారకంగా ఏడుస్తుంది. అంతలోనే మర్చిపోయి భగత్ వస్తాడు... వస్తాడు అంటూ, భగత్ కోసం ఎదురు చూస్తూ బయట నిలబడేది. ఒకసారి ఏర్ పోర్ట్ కు వెళ్ళిపోయింది. ఇంట్లో కనపడక అందరమూ గాభరా పడిపోయాము. అదృష్టవశాత్తూ, అక్కడ మాకు తెలిసిన వారు చూసి మాకు ఫోన్ చేయటంతో వెళ్ళి తీసుకొచ్చాము. ఒక సారి ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. కొన్ని సార్లు మా చిన్నప్పటి విషయాలు చెపుతూ అందులోకి వెళ్ళిపోతుంది. తనని ఇరవైనాలుగు గంటలూ కనిపెట్టుకొని ఉండాల్సి వచ్చింది. ట్రీట్మెంట్ ఇప్పించినా కోలుకోలేదు. భగత్ బతికే ఉన్నాడు. తన కోసం వస్తాడు అనే నమ్మకం! ఎప్పుడు ఏమి చేస్తుందో తెలియదు. పాణి అంకుల్, డాడీ వాలెంటరీ రిటైర్మెంట్ తీసుకొని వచ్చేసారు. ఒకరి తరువాత ఒకరు

భారతిని కనిపెట్టుకొని ఉండేవారు. అలాగే ఇన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. పెద్దవాళ్ళందరూ ఒకరి తరువాత ఒకరు పోయారు. నాకు పెళ్ళయ్యింది. నాకు ఉద్యోగం చేసుకోక తప్పదు కదా! మన ఉద్యోగాలల్లో పోస్టింగుల గురించి కూడా నీకు తెలుసుగా! ఇక తప్పక ఇక్కడ చేరిపించాను" గద్గదంగా చెపుతున్న రాజ్ ఒక్కసారిగా వినిపించిన కలకలానికి అటు చూసారు.

తెలుపు, ఆకుపచ్చ అంచు ఉన్న ఖాదీ చీర, మోచేతుల వరకూ చేతులున్న తెల్లని జాకిట్టు వేసుకొని, జుట్టు విరబోసుకొని, మువ్వన్నెల పతాకమును పట్టుకొని, లోపలి నుంచి ముందు భారతి, వెనుక హాస్పిటల్ ఆయా పరిగెత్తుకుంటూ వచ్చారు. వీళ్ళను చూడగానే ఆగిపోయింది భారతి.

"ఇందాకటి నుంచి స్నానం చేయించాటానికి సతాయించింది. జుట్టు దువ్వుతుంటే పారిపోయి వచ్చింది" సంజాయిషీ ఇస్తున్నట్లుగా అంది ఆయా.

ఆయా మాటలు పట్టించుకోకుండా భారతి వైపు చూసారు ఇద్దరు. ఒక్కసారిగా కదిలిన చెట్టుకొమ్మల గాలికి, భారతి చేతిలోని పతాకం రెపరెపలాడింది. చేతిలో ఎగురుతున్న పతాకము, విరబోసిన జుట్టు, ఆకుపచ్చ అంచు ఖాదీ చీర, తెల్ల బ్లౌజ్ తో భారతి అచ్చం భరతమాతలాగా ఉంది.

ఆఫీసర్ లు ఇద్దరూ అటెన్షన్ లో నిలబడి భరతమాతకు సెల్యూట్ చేసారు.

దూరంగా మైక్ నుంచి...

"ఆయె మేరే వతన్ కే లోగో

జర ఆంఖ్ మే భర్ లో పానీ

జో షహిద్ హుఎ హైన్ ఉన్ కీ

జర యాద్ కరో కుర్బాని

జై హింద్! జై హింద్ కి సేన

జై హింద్! జై హింద్ కి సేన

జై హింద్! జై హింద్! జై హింద్!"

లత మంగేష్కర్ పాట ఆర్ద్రంగా వినిపిస్తోంది.....

★★★

"I will come back hoisting the tricolor or wrapped in the tricolor, but I will definitely come back. "

– Captain Vikram Batra,

The ultimate heroic chakra

★★★★★

COMMENTS